క్లుప్తంగా

30న మండల సమావేశం

కొత్తూరు: ఈ నెల 30న మండల సర్వసభ్య సమావేశం ఇన్‌చార్జి ఎంపీపీ శోభా ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శరత్‌చంద్రబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటలకు నిర్వహించే సమావేశానికి మండల సర్పంచులు, ఎంపీటీసీలు, మండలస్థాయి అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



చెక్కులు అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం ఎదిరకు చెందిన అంజయ్య, ముష్టిపల్లికి చెందిన అనితకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు మంజూరయ్యాయని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సయ్యద్ హఫీజ్ తెలిపారు. శనివారం క్యాంపు కార్యాలయంలో అంజయ్యకు రూ. 56 వేలు, అనితకు రూ. 26 వేల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బాబురావు, ప్రమోద్‌రావు, బాల్‌రాజ్, రాజునాయక్, రామస్వామి,రెడ్డి నర్సింలు, పాల్గొన్నారు.

జీవాలకు చిటుకు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరి



గొర్రెలకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

షాబాద్: గొర్రెలకు, మేకలకు చిటుకు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని సోలీపేట్, మాచన్‌పల్లి, కుమ్మరిగూడ గ్రామాల్లో జీవాలకు చిటుకు వ్యాధి నివారణ టీకాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవాల ఆరోగ్యం పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గొర్రెలు, మేకలు అనారోగ్యానికి గురికాకుండా ప్రభుత్వం ఏడాదిలో రెండు విడతలు చిటుకు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. గ్రామాల్లో రైతులు అందుబాటులో ఉండి తమ జీవాలకు టీకాలు వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

షాద్‌నగర్‌రూరల్: మండలంలోని కమ్మదనం గ్రామ శివారులో నూర్ కళాశాల వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్లకు చెందిన అమీర్‌పేట చెన్నయ్యగౌడ్, మార్గని నర్సింహ్మలు కలిసి శనివారం రాత్రి సుమారు 8గంటలకు ద్విచక్రవాహనంపై కమ్మదనం వైపు వెళ్తున్నారు. నూర్ కళాశాల వద్ద ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని కారు ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఘనంగా రమాబాయి అంబేడ్కర్ వర్ధంతి



నివాళులర్పిస్తున్న స్వేరో సభ్యులు

చేవెళ్ల: బలహీన వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు నింపి తన జీవితాన్ని త్యాగం చేసిన వీర వనిత రమాబాయి అంబేడ్కర్ అని స్వేరో సర్కిల్ జిల్లా సంయుక్త కార్యదర్శి అనోక్ ఆనంద్ అన్నారు. మండలంలోని దామరగిద్దలో శనివారం అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఎం రామస్వామి ఆధ్వర్యంలో రమాబాయి అంబేడ్కర్ 88వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక స్త్రీగా తన కుటుంబాన్ని ఆరోగ్యాన్ని , తన జీవితాన్ని, ఆశలను కోరికలను కోల్పోయినా తన ఆత్మగౌరవం, ఆత్మస్థైర్యాన్ని మాత్రం కోల్పోలేదన్నారు. స్వయంగా అంబేడ్కరే ప్రపంచంలో నేను ఎవరికైనా అన్యాయం చేశానంటే అది కేవలం నా భార్య రమాబాయికి మాత్రమే అని చెప్పారని గుర్తు చేశారు. పౌష్టికాహారం లోపంతో నలుగురు పిల్లలను పోగొట్టుకున్న కడుపు కోతను అనుభవిస్తూ పిడకలు చేసి సంపాదించిన డబ్బును విదేశాల్లో ఉన్న అంబేడ్కర్ చదువులకు పంపించి ప్రోత్సహించిన ఆమె త్యాగం అనిర్వచనీయమని కొనియాడారు. అనాడు ఆమె చేసిన కృషి వల్లే అంబేడ్కర్ బలహీన వర్గాల ప్రజలకు దారి చూపించాడని తెలిపారు. కార్యక్రమంలో ఆల్‌ఇండియా అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, గ్రామ అంబేడ్కర్ సంఘం ఉపాధ్యక్షుడు మహేశ్, సభ్యులు నరేశ్, భీమ్‌రాజ్, తదితరులు ఉన్నారు.

చేవెళ్ల అభివృద్ధికి కృషి చేస్తా

ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి



ఎంపీ రంజిత్‌రెడ్డిని కలిసిన బార్ అసోసియేషన్ న్యాయవాదులు

చేవెళ్ల: నియోజకవర్గ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఎంపీని ఆయన నివాసంలో చేవెళ్ల కోర్టు బార్ అసోషియేషన్ న్యాయవాదులు, మండలంలోని బీఆర్‌ఎస్‌పార్టీ నాయకులు వేర్వేరుగా కలిసి పలు సమస్యల విన్నవించారు. చేవెళ్ల బార్ అసోసియేషన్ న్యాయవాదులు కోర్టుకు సంబంధించిన కోర్టు విస్తరణ, పరిధి పెంపుపై చర్చించారు. దీనిపై ఎంపీ సానుకూలంగా స్పందించారని చెప్పారు. కోర్టు పరిధి అభివృద్ధి, కోర్టులో ఉన్న సమస్యల పరిష్కారానికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని చెప్పారు. దీనిపై మంత్రులు, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి కోర్టు అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఎంపీకి బార్ అసోషియేషన్ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో కోర్టు న్యాయవాదులు అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బి. యాదిరెడ్డి, కార్యదర్శి చంద్రశేఖర్, న్యాయవాదులు రాంరెడ్డి, సత్యనారాయణరెడ్డి, రాఘునాథ్‌రెడ్డి, శంషోద్దీన్, వెంకటేశం, సంతజీవ్‌రెడ్డి, పెంటారెడ్డి, జనార్దన్, మహేశ్, రామకృష్ణ, మల్లేశ్, శివరాజ్, తదితరులు ఉన్నారు.

ఎంపీని కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు

మండలంలోని గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని పలు గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఎంపీని కలిశారు. శనివారం ఆయన నివాసానికి వెళ్లిన వారివారి గ్రామాల్లో ఉన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వాటిని పరిష్కరిస్తానని ఆయన వారికి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఎంపీని కలిసి వారిలో పార్టీ నాయకులు వనం లక్ష్మీకాంత్‌రెడ్డి, భూపతిరెడ్డి, ఎండీ అలీ, యువకులు ఉన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



విత్తనాలు, ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు, పోలీసులు

కొందుర్గు: రైతులకు నాసిరకం విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏఓ కృష్ణమోహన్ హెచ్చరించారు. జిల్లేడ్‌చౌదరిగూడ మండల కేంద్రంతో పాటు లాల్‌పహాడ్‌లో శనివారం ఎరువులు, విత్తనాల దుకాణాలను వ్యవసాయాధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాల్లో స్టాక్, బిల్లుల పుస్తకాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులకు విధిగా బిల్లులు ఇవ్వాలని, బిల్లుపై తప్పనిసరిగా కాలపరిమితి, లాట్ నంబర్ నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు కానిస్టేబుళ్లు నర్సింలు, బుగ్గయ్య పాల్గొన్నారు.

రైతుబంధుకు దరఖాస్తు చేసుకోండి

రైతులు 2023–24 సంవత్సరానికి గాను వానాకాలం సీజన్‌లో రైతుబంధు లాగిన్ ప్రారంభమైంది. నూతనంగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకంతో పాటు, బ్యాంక్ అకౌంట్, ఆధార్‌కార్డులతో సంబంధిత ఏఈఓలను సంప్రదించాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికే 'ప్రజాగర్జన'

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

మొయినాబాద్: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాగర్జన చేపడుతున్నామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.రామస్వామి అన్నారు. మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం సీపీఐ ఆధ్వర్యంలో ప్రజాగర్జన బహిరంగసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పోరాటంలో భాగంగానే ఇటీవల సీపీఐ ఆధ్వర్యంలో ఇంటింటికి సీపీఐ కార్యక్రమం నిర్వహించామన్నారు. జూన్ 4న కొత్తగూడెంలో ప్రజాగర్జన పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని.. జిల్లాలోని రైతులు, కార్మికులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు భారీగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమలో సీపీఐ మండల కార్యదర్శి కె.శ్రీనివాస్, చేవెళ్ల మండల కార్యదర్శి మల్లేశ్, నాయకులు రవీందర్‌రెడ్డి, అర్జున్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టిక ఆహారంతోనే ఆరోగ్యం




అవగాహన సదస్సులో మాట్లాడుతున్న గణేశ్

జెడ్పీవైస్ చైర్మన్ గణేశ్

నందిగామ: ప్రతి ఒక్కరు పౌష్టిక ఆహారం తీసుకోవాలని జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేశ్ సూచించారు. మండల కేంద్రం నందిగామలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీబాయ్ ఆధ్వర్యంలో 'మిషన్ మేరీ లైఫ్' అనే అంశంపై శనివారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెడ్పీవైస్ చైర్మన్ గణేష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరు చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలన్నారు. జొన్న, రాగులు, సజ్జలు పెసర్లు, బెబ్బెర్లు తదితర ధాన్యాలను ప్రతి రోజు తీసుకునే ఆహారంలో ఉండేలా చూసుకోవాలన్నారు. పౌష్టిక ఆహారం తీసుకోవడమే కాకుండా క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, ఇంట్లోని చిన్న పిల్లలకు సైతం చిన్నప్పటి నుంచే మంచి ఆహారం అలవాట్లు నేర్పాలని చెప్పారు. అంగన్‌వాడీ టీచర్లు చిన్నారులకు చిరుధాన్యాల వల్ల కలిగే ప్రయోజనాలు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ నాగమణి, ఎంపీటీసీ కుమారస్వామి గౌడ్, ఎస్‌ఎంసీ చైర్మన్ రాములు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఎస్సీ ధ్రువీకరణ పత్రాలు ఇప్పించండి



మంత్రిని కలిసిన కురువ సంఘం నేతలు

షాద్‌నగర్: మాదాసి, మాదారి కులస్థులకు ఎస్సీ ధ్రువీకరణ పత్రాలు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ సంఘం నాయకు లు శనివారం మంత్రి నిరంజన్‌రెడ్డి కలిసి వినతి పత్రం అందజేశారు. షాద్‌నగర్‌కు విచ్చేసిన మంత్రి నిరంజన్‌రెడ్డిని మాదాసి కురుమ సంఘం నాయకులు కలిశారు. ఎన్నో ఏళ్లుగా పోరా టం చేస్తున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని మంత్రికి విన్నవించారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం నాయకులు వెంకటేశ్, విఠలయ్య, అర్జున్ ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

కౌన్సిలర్ పిల్లి శారద



పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న శారద

షాద్‌నగర్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కౌన్సిలర్ పిల్లి శారద అన్నారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని 11వ వార్డులో మున్సిపల్ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. వీధులు, మురుగు కాల్వలు శుభ్రం చేయడం, కాలనీల్లో చెత్తాచెదారం, ముళ్ల చెట్లను తొలగించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయొద్దని సూచించారు. కార్యక్రమంలో శేఖర్, శ్రీను, మహేష్, కుమార్, గోపాల్, సంతోష్, బాలు, చందు, ఆర్పీ భారతమ్మ, జవాన్ దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌సెంటర్లు మంజూరు

నందిగామ: మండల కేంద్రం నందిగామ, మేకగూడకు సబ్‌సెంటర్లు మంజూరయ్యాయి. ఈ మేరకు ఆయా గ్రామాల్లో సబ్‌సెంటర్ల నిర్మాణానికి స్థల సేకరణకు రెవెన్యూ అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఈ విషయమై స్థానిక తహసీల్దార్ రహ్మాన్‌ఖాన్ మాట్లాడుతూ.. సాధ్యమైనంత త్వరగా స్థలాలను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని చెప్పారు.

గ్రామాల అభివృద్ధికి శ్రద్ధ

జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రవీందర్‌గౌడ్



పనులు ప్రారంభిస్తున్న రవీందర్‌గౌడ్

శంకర్‌పల్లి: గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, మిర్జాగూడ సర్పంచ్ గౌండ్ల రవీందర్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని మిర్జాగూడ అనుబంధ గ్రామమైన ఇంద్రారెడ్డి నగర్ 8, 9వ వార్డుల్లో రూ.12లక్షలు గ్రామ పంచాయతీ నిధులతో సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామా లు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని అన్నారు. మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను మంజూరు చేస్తుందని తెలిపారు. గ్రామంలో సీసీరోడ్లు, అండర్‌డ్రైనేజీ సమస్యలు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కురుమ వెంకటేశ్, ఉపసర్పంచ్ శాంతికిషన్ సింగ్, వార్డు సభ్యులు ప్రవీణ్‌కుమార్, సురేందర్‌రెడ్డి, చిట్టమ్మ, మంగమ్మ, సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు అంజయ్య, గోపాల్‌నాయక్, నర్సింహాగౌడ్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగయ్య



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న జంగయ్య

షాద్‌నగర్‌రూరల్: ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలను కల్పించేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య డిమాండ్ చేశారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండలంలోని కొండన్నగూడలో ఉపాధి పనులను ఆయన పరిశీలించి, కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జంగయ్య మాట్లాడుతూ.. ఉపాధి కూలీలకు సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నీళ్లు, టెంట్లు, పార, గడ్డపార, గంపలు, వైద్య కిట్లు కనీస సౌకర్యాలు కల్పించకుండా వారితో వెట్టిచాకిరి చేయిస్తున్నారని ఆరోపించారు. కనీస సౌకర్యాలను కల్పించాలని ఉపాధిహామీ చట్టంలో ఉన్నప్పటికీ ప్రభుత్వం కూలీలను పట్టించుకోవడం లేదని వాపోయారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ చట్టాన్ని సక్రమంగా అమలు చేయకుండా రోజురోజుకు నిధులను తగ్గిస్తూ పథకాన్ని నిర్వీర్యం చేస్తుందని మండిపడ్డారు. ఉపాధి కూలీలు పని పూర్తి చేసి రెండు వారాలవవుతున్నా బిల్లులు రావడం లేదని అన్నారు. ఉపాధి పథకంలో పని చేస్తున్న కూలీలకు 200 రోజుల పని దినాలను కల్పించడంతో పాటుగా రోజువారి కూలీ రూ.600 ఇవ్వాలన్నారు. లేని పక్షంలో జూన్ 5న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడిని చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రయ్య, రాములు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి పల్లకీ సేవ

షాద్‌నగర్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం ఆలయ కమిటీ సభ్యుడు పులిమామిడి శ్రీశైలంగౌడ్ ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి భక్తిశ్రద్ధలతో పల్లకీ సేవ కార్యక్రమం నిర్వహించారు. అలాగే, సత్యనారాయణ స్వామి వ్రతం చేపట్టారు. భజనలు, భక్తి పాటలు, కీర్తనలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అనంతరం మాజీ ఎంపీపీ చల్లావెంకటేశ్వర్‌రెడ్డి దంపతులు భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అన్నదాతలకు ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రఘుగౌడ్, రమేశ్, రఘునందన్‌రెడ్డి, లక్ష్మణ్, కిషన్‌నాయక్, రాఘవేందర్, రమేశ్, నర్సింలు, నారాయణ, శ్రీనివాస్, కృష్ణయ్య, లక్ష్మీకాంత్‌రెడ్డి, కృష్ణాచారి పాల్గొన్నారు.



పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్



చిన్నారితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్

శంకర్‌పల్లి: ప్రైవేట్ ఆస్పత్రులు నిబంధనల పాటించకపోతే చర్యలు తప్పవని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం పట్టణ కేంద్రంలోని ఇందిరా చిల్డ్రన్స్ ఆస్పత్రిని ఆయన సందర్శించి, వార్డులను పరిశీలించారు. చికిత్స పొందుతున్న చిన్నారులతో మాట్లాడారు. వైద్య సేవలు ఏ విధంగా అందిస్తున్నారనే విషయం ఆరా తీశారు. శుక్రవారం ఆస్పత్రిలో కాలపరిమితి ముగిసిన సెలైన్ ఎక్కించడంతో ఆస్పత్రి యాజమాన్యంపై మండిపడ్డారు. చిన్నారి సృజన(14) ఆరోగ్య పరిస్థితి గురించి వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి మాట్లాడారు. చిన్నారి ఆరోగ్యం బాగానే ఉందని వారు తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రులు రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని... ఇష్టానుసారంగా డబ్బులను వసూలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆస్పత్రుల్లో, మెడికల్ షాపుల్లో కాలపరిమితి ముగిసిన మందులు లేకుండా ఎప్పటికప్పుడు చూసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది గోపాల్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి ఉన్నారు.

ఆలయాల జీర్ణోద్ధరణకు పూర్తి సహకారం

జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి



హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న అవినాశ్‌రెడ్డి

షాబాద్: శిథిల దేవాలయాల జీర్ణోద్ధరణకు పూర్తి సహకారం అందిస్తామని జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని సంకెపల్లిగూడలో ఇటీవల పునర్నిర్మించిన హనుమాన్ దేవాలయం, బొడ్రాయి ప్రాంతాన్ని ఆయన సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని శిథిలావస్థలో ఉన్న దేవాలయాల జీర్ణోద్ధరణ కోసం తనవంతుగా పూర్తి సహకారం అందిస్తానని చెప్పారు. హనుమాన్ ఆలయం పునరుద్ధరణకు గ్రామస్తులు తనను కోరిన వెంటనే రూ.2.50 లక్షల అందించామని చెప్పారు. మండలంలోని పలు గ్రామాల్లోని దేవాలయాల పునర్నిర్మాణాలకు విరాళం అందజేస్తున్నట్లు వెల్లడించారు. గ్రామంలో అంతర్గత సీసీరోడ్లు, మహిళా భవనం నిర్మాణాలు, మంచినీటి సమస్యకు సర్పంచ్ దర్శన్, ఉపసర్పంచ్ రాజేందర్‌రెడ్డి, మహిళలు అవినాశ్‌రెడ్డికి వినతి పత్రాలు అందజేశారు. సానుకూలంగా స్పందించి అందిరి సహకారంతో త్వరలో నిధులు మంజూరు చేయిస్తామన్నారు. అనంతరం జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డిని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, గ్రామస్తులు, వార్డు సభ్యులు, డ్వాక్రా మహిళలు తదితరులున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్.. యువకుడు మృతి



ప్రమాదానికి కారణమైన టిప్పర్

మొయినాబాద్: వేగంగా దూసుకొచ్చిన టిప్పర్ వెనక నుంచి బైక్‌ను ఢీకొట్టడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ ఘటన మండలంలోని అజీజ్‌నగర్ రెవెన్యూలో ఉన్న రాణే ఇంజన్ వాల్స్ వద్ద శనివారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ డీకే లక్ష్మీరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గుజరాత్‌కు చెందిన మతుకియ రవి(25), అభిషేక్ మండలంలోని అజీజ్‌నగర్‌లో ఉన్న పటేల్ ఫ్రీకాస్ట్ కంపెనీలో పనిచేస్తున్నారు. శనివారం ఇరువురు బైక్‌పై అప్పాజంక్షన్‌కు వెళ్లారు. తిరిగి వస్తుండగా రాణే ఇంజన్‌వాల్స్ కంపెనీ వద్ద వెనక నుంచి టిప్పర్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న రవి, అభిషేక్ రోడ్డుపై పడ్డారు. రవి తలకు రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అభిషేక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. అభిషేక్‌ను నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలి

శంకర్‌పల్లి: పట్టణ కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిరుపేదలకు ఇవ్వాలని సీపీఎం చేవెళ్ల డివిజన్ కన్వీనర్ అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో శనివారం పట్టణ కేంద్రంలోని గణేష్‌నగర్, సాయినగర్, అయ్యప్పరెడ్డి గూడ, సింగాపురం తదితర కాలనీల్లో నివాసం ఉంటున్న పేద కుటుంబాల వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 20–30సంవత్సరాలుగా శంకర్‌పల్లిలో నివాసం ఉంటున్నా వారికి సొంత ఇళ్లు, ఆధార్, రేషన్, ఓటర్ కార్డులు కూడా లేకపోవడం చాలా బాధాకరమన్నారు. వీరికి ప్రభుత్వం తరఫున ఎటువంటి సంక్షేమ పథకాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లులేని వారికి శంకర్‌పల్లిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లల్లో అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి మల్లారెడ్డి, నాయకులు నర్సింహా, శ్రీనివాస్, మల్లేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.